క్లుప్తంగా

ఉప్పాడలో రన్ ఫర్ జీసస్



ఉప్పాడలో క్రైస్తవులు నిర్వహిస్తున్న రన్ ఫర్ జీసస్ ర్యాలీ

కొత్తపల్లి: క్రీస్తును శిలువ వేసిన తరువాత మూడో రోజున ఆయన పునరుద్ధానం చెందిన సువార్తను తెలియపరచడానికి రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని క్రైస్తవులు నిర్వహిస్తారని బేథేల్ బాప్టిస్ట్ పాస్టర్ సమర్పణరావు అన్నారు. ఉప్పాడలో పాస్టర్స్ ఫెలోషిప్ ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీస్తు ప్రేమ, మంచితనం, జాలి లోకానికి తెలియపరచడమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో టి.రాబిన్ తదితరులు పాల్గొన్నారు.

నూకాలమ్మ తల్లి దర్శనానికి పోటెత్తిన భక్తులు



అమ్మవారి దర్శనానికి క్యూలైన్లలో వేచియున్న భక్తులు

పెద్దాపురం: కాండ్రకోట నూకాలమ్మ తల్లి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. కొత్త అమావాస్యను పురస్కరించుకుని 45 రోజుల పాటు నిర్వహించే జాతర మహోత్సవాల్లో భాగంగా ఆలయ కమిటీ చైర్మన్ గవరసాని వీరాస్వామి, ఆలయ ఈఓ తలాటం వెంకట సూర్యనారాయణల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. పెద్దాపురం సీఐ అబ్దుల్ నబీ పర్యవేక్షణలో ఎస్ఐ వెలుగుల సురేష్ బందోబస్తు ఏర్పాట్లు చూశారు. వేల సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. స్వచ్ఛంద సంస్థల సభ్యులు యాత్రికులకు మజ్జిగ, పాలు పంపిణీ చేశారు.

టౌన్‌హాల్ నూతన కార్యవర్గం ఎన్నిక



టౌన్‌హాల్ కమిటీ నూతన కార్యవర్గ సభ్యులు

బోట్‌క్లబ్: స్థానిక మెయిన్‌రోడ్డులోని టౌన్‌హాల్ కమిటీ నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం ఏకగ్రీవం జరిగాయి. అధ్యక్షులుగా జీఎస్ఎన్ మూర్తి (నానాజీ), కార్యదర్శిగా పోబోలు పున్నయ్య, ఉపాధ్యక్షులుగా జీవై రఘునాథ్ (రఘు), సంయుక్త కార్యదర్శిగా వీవీ సుబ్రహ్మణేశ్వరరావు, కోశాధికారిగా ఎం.సూర్యనారాయణరాజు, కార్యవర్గ సభ్యులుగా బి శివప్రసాద్, పి.రామచంద్రరావు, బసవా ప్రసాద్, ఎస్‌జీఆర్ సుబ్రహ్మణ్యం, ఎం సత్యనారాయణ, నెక్కంటి శ్రీనివాస్, బచ్చు శేఖర్, పీవీవీ ఎస్ఎన్ సతీష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా జీవీ కృష్ణప్రకాష్, ఎన్‌వీ నరసింహారావు వ్యవహరించారు. కార్యదర్శి పోబోలు పున్నయ్య మాట్లాడుతూ మే 14న క్లబ్ డే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సభ్యుల సహకారంతో అభివృద్ధి, సేవా కార్యక్రమాలు చేస్తామన్నారు.

ఆర్ఎంపీ వైద్యుడికి డాక్టరేట్



ఢిల్లీలో డాక్టరేట్ అందుకుంటున్న ఆర్ఎంపీ వైద్యుడు ప్రసాద్

ఏలేశ్వరం: మండలంలోని యర్రవరం గ్రామానికి చెందిన రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్ (ఆర్ఎంపీ) వైద్యుడు గుండేపల్లి ప్రసాద్‌కి గౌరవ డాక్టరేట్ లభించింది. వైద్య రంగంలో ఆయన అందించిన సేవలకు గుర్తింపుగా ఢిల్లీకి చెందిన మ్యాజిక్ బుక్ ఆఫ్ రికార్డ్ సంస్థ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. యర్రవరం పరిసర గ్రామాల్లో 35 ఏళ్లుగా ప్రసాద్ ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారు. గౌరవ డాక్టరేట్ పొందిన ప్రసాద్‌ను పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు అభినందించారు.

చలివేంద్రం ప్రారంభం

ఏలేశ్వరం: ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో మండలం యర్రవరంలో వివేకానంద సేవా సమితి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని ట్రస్టు అధ్యక్షుడు మైరాల నాగేశ్వరరావు ప్రారంభించారు. ప్రస్తుత వేసవిలో వాహనదారులు, బాటసారుల సౌకర్యార్థం ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

కల్యాణం.. మంటపంలో..

- ఏసీ ఏర్పాటు చేయాలని ప్రజల డిమాండ్
- ముఖ్య కూడలిలో అందుబాటులో మండపం
- ప్రతిపాదనలకే పరిమితమవుతున్న అభివృద్ధి
- వేసవి తాపంతో కొట్టుమిట్టాడుతున్న పెళ్లివారు



సామర్లకోట రైల్వే కల్యాణ మండపం

సామర్లకోట: పట్టణ ముఖ్య కూడలిలోని రైల్వే కల్యాణ మండపంపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. 15 ఏళ్ల క్రితం రైల్వే స్టేషన్, బస్సు కాంప్లెక్స్‌కు అతి సమీపంలో ఈ మండపాన్ని నిర్మించారు. రైల్వే ఉద్యోగులకు రోజుకు రూ.మూడు వేలు, బయట వ్యక్తులకు రూ.25 వేలు అద్దె చెల్లించాల్సి ఉంటుంది. దీనికి తోడు రూ.10వేలు కార్పస్ ఫండ్‌గా డిపాజిట్ చేయాలి. ఈ మొత్తం నుంచి సర్వీసు చార్జిలు మినహాయించుకొని మిగిలిన మొత్తం చెల్లించాల్సి ఉంది. ఈ మండపంలో మొదటి, రెండో అంతస్తులలో రూములు ఉన్నాయి. మారుతున్న కాలానికి అనుగుణంగా ఈ మండపాన్ని ఏసీగా అభివృద్ధి చేయాలన్న డిమాండ్లు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి.

పట్టణ పరిధిలో ఉన్న మిగిలిన కల్యాణ మండపాల్లో సరైన వసతులు లేకపోయినా అనుమతులు మంజూరు చేయడంతో పెళ్లిళ్ల సీజన్‌లోనూ, ఇతర కార్యక్రమాలు జరిగినపుడూ ఆయా ప్రాంతాల్లో విపరీతమైన ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ఈ కల్యాణ మండపాలకు చైర్మన్‌గా రైల్వే అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ వ్యవహరిస్తారు. ఇందులో భాగంగా కాకినాడలోని రైల్వే ఇన్‌స్టిట్యూట్‌కు ఏసీ ఏర్పాటు చేసి కల్యాణ మండపంగా వినియోగిస్తున్నారు. అదేదో నేరుగా కల్యాణ మండపానికే ఏర్పాటు చేస్తే రూ.20 వేల వరకు అద్దె పెరిగే అవకాశం ఉంటుందని, రూ.45 వేలకే ఏసీ కల్యాణ మండపం వచ్చే అవకాశం ఉంటుందని స్థానికులు అంటున్నారు.

అధికారులు దృష్టి పెట్టాలి



వేసవిలోనే వివాహాది శుభకార్యాలు జరిగే అవకాశమున్న నేపథ్యంలో రైల్వే కల్యాణ మండపాన్ని ఏసీగా మార్చాలి. అధికారులు దృష్టి సారించి ప్రజలకు అందుబాటులో అద్దెలు ఉంచాలి.
– కాశ్ల లక్ష్మీనారాయణ, కాంట్రాక్టరు, సామర్లకోట

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



కల్యాణ మండపాలకు ఏసీల ఆవశ్యకతను జీఎం దృష్టికి తీసుకువెళ్లాం. విజయవాడ డివిజన్ అధికారుల సూచనల మేరకు ఎలక్ట్రికల్ విభాగంవారు సర్వే చేశారు. ఇటీవల జరిగిన కల్యాణ మండప కమిటీ సమావేశంలో ఏసీపై సూచించాం. త్వరలో ఏర్పాటవుతుందని ఆశిస్తున్నాం.
– ఎం.రమేష్, రైల్వే మేనేజరు, సామర్లకోట

క్రైస్తవులకు అండగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం

ఎమ్మెల్యే పెండెం దొరబాబు



సామర్లకోటలో సమాధుల వద్ద కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

కొత్తపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం క్రైస్తవులకు అన్నివిధాలా అండగా నిలబడుతోందని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. మండలంలోని ఉప్పాడ హోసన్నా సీయోను ప్రార్థనా మందిరంలో ఈస్టర్ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. పాస్టర్ ఎంజీ రాయ్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే పెండెం దొరబాబు ముఖ్య అతిథిగా హాజరై క్రైస్తవులకు ఈస్టర్ శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేను సంఘ సభ్యులు శాలువ, పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పెండెం దొరబాబు మాట్లాడుతూ క్రైస్తవుల మందిరాలకు మరమ్మతుల నిమిత్తం నిధులు కేటాయిస్తున్నామని, క్రైస్తవుల సమస్యలేవైనా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్, వైస్ ఎంపీపీ మాదిరెడ్డి దొరబాబు, మండల పార్టీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, పార్టీ సచివాలయాల మండల కన్వీనర్ ఉమ్మిడి జాన్, ఎంపీటీసీలు మేరుగు ఎల్లాజీ, చొక్కా సింగన్న తదితరులు పాల్గొన్నారు.

మండల గ్రామాల్లో..

పెద్దాపురం: పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో ఈస్టర్ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని దివిలి, తిరుపతి, చదలాడ, కాండ్రకోట, పిఠాపురం మండలం విరవ క్రీస్తు శాంతి ప్రార్థనా మందిరాల్లో ఈస్టర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. దైవజనులు నంగిన సత్యానందం, సీజీఎం వ్యవస్థాపకులు నంగిన శామ్యూల్ సుదీప్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సుమారు 1000 మంది విశ్వాసులు ఆరాధనల్లో పాల్గొన్నారు. దైవజనులు అభిషేక్, నంగిన శాంత కుమారి, నంగిన ప్రేమలత, విశాల పాల్గొనగా శాంతివర్ధన విభిన్న ప్రతిభావంతుల పాఠశాల నిర్వాహకులు రాయవరపు వీరబాబు, సత్యతో పాటు అధిక సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు. అలాగే స్థానిక జగ్గంపేట రోడ్డులోని తండ్రి కుమార పరిశుద్ధాత్మ సంఘం ఆధ్వర్యంలో పరంజ్యోతిమ్మ ఏసు పునరుత్థానంపై బోధించారు. ఈ కార్యక్రమంలో దానియేలు, రౌతు సూరిబాబు, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే దొరబాబును సత్కరిస్తున్న క్రైస్తవులు



ఆరాధనలో మాట్లాడుతున్న సత్యానందం

కొవ్వొత్తుల వెలుగులో సమాధుల తోట

సామర్లకోట: స్థానిక బ్రౌన్‌పేటలో ఉన్న సమాధుల కమిటీ అధ్యక్షుడు బీఎస్ వందనం మాస్టారు ఆధ్వర్యంలో క్రైస్తవులు నూతన వస్త్రాలు ధరించి మరణించిన వారి వారి కుటుంబ సభ్యుల సమాధుల వద్దకు వెళ్లి ప్రార్థనలు చేశారు. దీనిలో భాగంగా పిఠాపురం రోడ్డులోని సమాధుల తోటలో పూలతో, విద్యుద్దీపాలతో, కొవ్వొత్తులతో అలంకరించారు. క్రీస్తు సజీవుడిగా లేచిన సందర్భాన్ని జ్ఞాపకం చేసుకొంటూ ప్రార్థనలు చేశారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ ఉబా జాన్‌మోజెస్, కో ఆప్షన్ సభ్యుడు దవులూరి దొరబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్ని ఈస్టర్ శుభాకాంక్షలు తెలిపారు. క్రిస్టియన్ మైనార్టీ కో ఆప్షన్ సభ్యుడు సల్లూరి కల్యాణ్, మండల పాస్టర్ల సంఘ అధ్యక్షుడు పి.ఆనంద్‌బాబు తదితరులతో పాటు పాస్టర్లు బి.కిరణ్‌కుమార్, వి.శామ్యూల్, జయబాబు, ఎండీవీ ప్రసాద్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సమాజ సేవతో జీవితం చరితార్థం



సమావేశంలో మాట్లాడుతున్న సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరావు

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): సమాజ సేవ, ఆధ్యాత్మిక సూక్తులను ఆచరించి జీవితాన్ని చరితార్థం చేసుకోవాలని సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు పిలుపునిచ్చారు. కాకినాడలోని రంగాసాయి మండపంలో ఆదివారం జరిగిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. బాల్యం నుంచి మానవతా విలువలను పెంపొందించే సత్యసాయి బాలవికాస్ తరగతులకు తమ పిల్లలను పంపించాలని తల్లితండ్రులను కోరారు. సత్యసాయి ఆరాధన దినోత్సవం సందర్భంగా ఈ నెల 24న అన్నదానం నిర్వహించాలన్నారు. సేవా సంస్థల సంస్కృతిక వ్యవహారాల భజనల సమన్వయ కర్త ఎమ్మెస్ ప్రకాశరావు మాట్లాడుతూ కుటుంబ సభ్యులు రోజులో కొంత సమయాన్ని సామూహిక భజనలు చేయడం, మృదు మధురమైన సంభాషణ చేయాలన్నారు. సేవా సమితి జిల్లా అధ్యక్షుడు యర్లగడ్డ గోవిందరాజులు, సేవా సమితి కన్వీనర్ అశోక్, సీనియర్ సమన్వయ కర్తలు ఉషారాణి, శ్యామల, పద్మజ పాల్గొన్నారు.

మహనీయుల సేవలు ఆదర్శనీయం



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ వెంకన్నారావు

కరప: మండలం వేళంగిలోని శ్రీనివాసా నర్సింగ్ హోమ్ ప్రాంగణంలో ఆదివారం లయన్ డాక్టర్ బొండా వెంకన్నారావు ఆధ్వర్యంలో సమతా మూర్తులైన స్వాతంత్ర్య సమరయోధులు, మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్, సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిభాపూలే, భారతరాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ల జయంతి ఘనంగా నిర్వహించారు. డాక్టర్ వెంకన్నారావు ఇతర వక్తలు ఆ త్రిమూర్తుల జీవిత విశేషాలు వివరించి వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం వారికి నివాళులు అర్పించారు. నవయుగ భారతి, జాగృతి సంపాదకులు డాక్టర్ వడ్డి విజయసారధి, సామాజిక సమరసత రాష్ట్ర సహకార కార్యదర్శి రాజారామచంద్ర, డాక్టర్ ఎస్.వీరభద్రరావు, దళిత రచయిత, బుద్దిస్ట్ సవిలే రాజేష్, వేళంగి గ్యాడ్యుయేట్స్ అధ్యక్షుడు శాకా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సమతా త్రిమూర్తులకు నివాళులర్పిస్తున్న సర్వజన సమాజ్ నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ రత్నాకర్ తదితరులు

కాకినాడ కల్చరల్: స్వర్గీయులు బాబు జగ్జీవన్ రామ్, మహాత్మా జ్యోతిరావ్‌పూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ల సేవలు అదర్శనీయమని సర్వజన సమాజ్ నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ ఆర్ఎస్ రత్నాకర్ అన్నారు. స్థానిక ఎస్ఎఫ్‌సీఎల్ రోడ్డులోని సత్కళావాహిని భక్తిరస సంగీత సంస్థ ఆడిటోరియంలో సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం వారి జయంతి వేడుకలను సమతా త్రిమూర్తులు పేరుతో నిర్వహించారు. ముందుగా వీరికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సమాజాభివృద్ధిలో సమతా త్రిమూర్తుల పాత్ర కీలకమైనదని, ప్రముఖ సమాజ సేవకులు వడ్డి విజయసారథి అన్నారు. పలువురు వక్తలు వీరు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో వేదిక ప్రతినిధి రాజారామచంద్ర, పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌లో మానసిక రుగ్మతలను చేర్చాలి

కొత్తపల్లి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో మానసిక రుగ్మతలు కలిగిన వ్యక్తులకు అందించే వైద్య సేవలను చేర్చాలని కోరుతూ ఎమ్మెల్యే దొరబాబుకు మండల మానసిక రుగ్మతల వ్యక్తుల సంరక్షుల కమిటీ అధ్యక్షుడు సాయిబాబు వినతి పత్రం అందజేశారు. ఆదివారం ఉప్పాడలో ఒక కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే దొరబాబుకు ఈ మేరకు విన్నవించారు. మండలంలో మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న 172 మంది రోగుల ఇబ్బందులను కమ్యూనిటీ మొబిలైజర్ గంపల నాగమల్లి వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే దొరబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించే విధంగా కృషి చేస్తానన్నారు.

రత్నగిరిపై సూర్యనమస్కారాలు



తీర్థప్రసాదాలు స్వీకరిస్తున్న ఈఓ అజాద్

అన్నవరం: రత్నగిరి కళావేదికపై ఆదివారం సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు, సూర్యనమస్కారాలు నిర్వహించారు. ఆలయ పండితులు ఉదయం తొమ్మిది గంటలకు విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు చేసి వివిధ భంగిమల్లో సూర్య నమస్కారాలు సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

రైతులకు సన్మానం

కిర్లంపూడి: భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ వేడుకలను పురస్కరించుకుని ఆదివారం ఆ పార్టీ నాయకులు బూరుగుపూడిలో రైతులను సన్మానించారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వై. మాలకొండయ్య ఆధ్వర్యంలో పలువురు రైతులను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కిసాన్ సమ్మాన్ యోజనను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నవరత్నాలతో సంక్షేమ కాంతులు



పిఠాపురంలో స్థానికులకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- పిఠాపురంలో గడపగడపకూ మన ప్రభుత్వం

పిఠాపురం: నవరత్నాలతో ప్రతి కుటుంబంలో సంక్షేమ కాంతులు సంతరించుకున్నాయని ఎమ్మెల్యే పెండెం దొరబాబు పేర్కొన్నారు. పిఠాపురం పట్టణం 13వ వార్డు 6వ సచివాలయం పరిధిలో ఆదివారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి గత నాలుగేళ్లుగా ప్రభుత్వం ద్వారా ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అంటూ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పెండెం దొరబాబు మాట్లాడుతూ సంక్షేమ పథకాల పంపిణీలో ఎటువంటి అవకతవకలకు తావు లేదని, ఎవరి ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాలకే సాయం అందేలా చర్యలు తీసుకున్నారని వివరించారు. మేనిఫెస్టోలో చెప్పిన విధంగా ఇచ్చిన హామీలన్నీ సీఎం జగన్ నెరవేరుస్తున్నారన్నారు. రాష్ట్రంలో అమల్లోకి తీసుకొచ్చిన సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచాయని చెప్పారు. జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతిదీవెన, అమ్మ ఒడి, వైఎస్సార్ చేయూత, నాడు–నేడు వంటి అనేక పథకాలతో ప్రజా రంజక పాలన సాగిస్తున్నారన్నారు. ప్రజా సంక్షేమం కోసం పరితపిస్తున్న జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, వైఎస్సార్ సీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జగనన్నే మా భవిష్యత్తు



హుస్సేన్‌పురంలో ఉప సర్పంచ్ ఆధ్వర్యంలో పర్యటిస్తున్న పార్టీ నాయకులు



కొండెవరంలో నిర్వహిస్తున్న జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం

సామర్లకోట: జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ఆదివారం సామర్లకోట పట్టణ, మండలంలోని అన్ని గ్రామాలలో ఉత్సాహంగా నిర్వహించారు. ఆయా గ్రామాల సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు, ఉప సర్పంచ్‌లు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లతో కలసి ఇంటింటికీ పర్యటించి సీఎం జగన్ పాలనపై అభిప్రాయాలను సేకరిస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలో స్థానిక 26వ వార్డులో ఇన్‌చార్జి నక్కా శ్రీనివాసు, విద్యా కమిటీ చైర్మన్ నక్కా జానకి రామయ్య పాల్గొని పార్టీపై ప్రజాభిప్రాయాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమానికి మంచి స్పందన లభించడంతో నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొంటున్నారు.

కొత్తపల్లి: మండలంలోని కొండెవరంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని కొత్తపల్లి వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షుడు మారిశెట్టి సత్తిబాబు ఆధ్వర్యంలో ఆదివారం చేపట్టారు. గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, ప్రజాప్రతినిధులు గ్రామ వలంటీర్లతో కలిసి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వెళ్లి జగనన్న స్టిక్కర్లను అతికించారు.ఈ సందర్భంగా సత్తిబాబు మాట్లాడుతూ పేదల జీవితాల్లో వెలుగులు నింపిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందని చెప్పారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



ఆత్మీయ కలయికలో పాల్గొన్న 1976-77 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు

- ఒకే వేదిక పైకి 1976–77 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు
- ఆటపాటలతో సందడి చేసిన చిన్ననాటి మిత్రులు

పిఠాపురం: కాలం ఒక్కసారిగా 46 ఏళ్లు వెనక్కి వెళ్లిపోయింది. పూర్వ విద్యార్థుల మోముల్లో మల్లెల్లాంటి చిరునవ్వు గుబాళించింది. జ్ఞాపకాల దొంతరలన్నీ ఒక్కసారిగా కళ్ల ముందు కదలాడాయి. వెనక బెంచి అల్లర్లు, గురువుల మందలింపులు, ఆటపాటల ఆనందోత్సాహాలు, స్నేహితులతో పెనవేసుకున్న అనురాగ బంధాలు.. తలంపులోకి రాగానే కళ్లల్లోంచి ఆనందభాష్పాలు కన్నీరై జాలువారాయి. గొల్లప్రోలు జిల్లా పరిషత్ పాఠశాలలో 1976–77 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ కలయిక కార్యక్రమం నిర్వహించుకున్నారు. వైజాగ్, చెన్నై, హైదరాబాద్ లాంటి నగరాల్లో స్థిరపడిన పూర్వవిద్యార్థులంతా తాము చదువుకున్న పాఠశాలలోనే మిత్రులంతా ఒకేచోట చేరి చిన్ననాటి జ్ఞాపకాల్ని నెమరువేసుకుంటూ ఆటపాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా తమకు విద్య నేర్పిన అప్పటి గురువుల్ని సత్కరించుకున్నారు.

రచనలు సమాజాన్ని ప్రభావితం చేస్తాయి



మాయ పుస్తక పరిచయ సభలో పాల్గొన్న జానకిరామ్‌చౌదరి తదితరులు

కాకినాడ కల్చరల్: రచయిత గంటేడ గౌరినాయుడు రచనలు సమాజాన్ని ప్రభావితం చేస్తాయని సాహితీ స్రవంతి నగరశాఖ అధ్యక్షుడు మార్ని జానకిరామ్‌చౌదరి అన్నారు. స్థానిక రాజారామ్మోహన్‌రాయ్ వీధిలోని శాస్త్రి కళాప్రాంగణంలో సాహితీ స్రవంతి నగరశాఖ ఆధ్వర్యంలో ఆదివారం ప్రముఖ రచయిత గంటేడ గౌరునాయుడు రచించిన మాయ (కథాసంపుటి) పుస్తక పరిచయ సభ స్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షులు గనారా అధ్యక్షతన జరిగింది. పల్లెజీవన విధానాన్ని అద్దంపట్టేలా గంటేడ రచనలు ఉంటాయని శాస్త్రి సేవాపీఠం అధ్యక్షుడు పీఎస్ఎస్ఎన్‌పీ శాస్త్రి అన్నారు. అనంతరం కవి సమ్మేళనం జరిగింది. పి.పద్మజావాణి, జోస్యుల కృష్ణబాబు, గరికిపాటి మాస్టార్, డా.శైలజ, మణిబాబు, అద్దేపల్లి జ్యోతి, రామస్వామి తదితర రచయితలు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

గోకవరం: మండలంలోని భూపతిపాలెం గురుకుల పాఠశాలలో ఐదో తరగతి ప్రవేశాలకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు పాఠశాల ప్రిన్సిపల్ బేతపూడి రవి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుల స్వీకరణకు ఈ నెల 24 వరకూ గడువు ఉందన్నారు. అభ్యర్థులు 2021–23 విద్యా సంవత్సరంలో 3, 4వ తరగతులు చదివి ఉండాలని, తూర్పుగోదావరి జిల్లాలోని గ్రామీణ ప్రాంత విద్యార్థులు మాత్రమే అర్హులన్నారు. ఓసీ, బీసీ అభ్యర్థులు 2012 సెప్టెంబర్ 1 నుంచి 2014 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 2010 సెప్టెంబర్ 1 నుంచి 2014 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలని వివరించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మే 20న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఇతర వివరాలకు 95665 59622 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

15 నుంచి చేపల వేట నిషేధం

తొండంగి: సముద్రంలో మత్స్యసంపద అభివృద్ధి కోసం ప్రభుత్వం ఈ నెల 15 నుంచి జూన్ 14 వరకూ చేపల వేట నిషేధాన్ని అమలు చేస్తోందని తుని మత్స్యశాఖ అభివృద్ధి అధికారి సీహెచ్ ఉమామహేశ్వరరావు ఆదివారం తెలిపారు. వేట నిషేధ సమయంలో నాటు పడవలు మినహా మోటార్ బోట్లు, మెకనైజ్డ్ బోట్లతో చేపల వేట చేయరాదన్నారు. మండలంలోని మత్స్యకారులు చేపల వేట నిషేధానికి సహకరించాలని కోరారు.

భానుడి భగభగలు

తొండంగి: ఎండలు మండిపోతున్నాయి. ఉదయం 8 గంటలకే భానుడు ఉగ్రరూపం దాల్చుతున్నాడు. ఆదివారం ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఉక్కబోతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం రహదారులు నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి. ఎండలు మరింత తీవ్రంగా ఉంటాయని వాతావరణశాఖ ప్రకటించిన నేపథ్యంలో వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఏవీ నగరం పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రవికుమార్ తెలిపారు.